www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 29 ఆగస్టు 2024

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ శాఖ ఇఇ రాజశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఇపిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం సంబంధించిన సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని బకాయిలు విడుదల చేసేవరకు వారికి బిల్లులు మంజూరు చేయవద్దని కోరారు. సానుకూలంగా స్పందించిన ఇఇ రాజశేఖర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇపిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇఇకి వినతి పత్రం సమర్పిస్తున్న విద్యుత్ కార్మికులు

కొప్పర్తికి మహర్దశ

- రూ.8,860 కోట్లతో పారిశ్రామిక హబ్
- 2,596 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు
- రూ.2,137 కోట్లతో ప్రాజెక్టు వ్యయం
- 54,500 మందికి ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కొప్పర్తి పారిశ్రామికవాడకు మహర్దశ పట్టనుంది. బుధవారం కేంద్ర కేబినెట్‌లో కొప్పర్తి పారిశ్రామికవాడ పారిశ్రామిక హబ్‌గా మార్పు చెందడానికి ఆమోదం లభించినట్లు కేంద్ర మంత్రి అశ్వనీవైష్ణవ్ పేర్కొన్నారు. దేశంలోని 234 కొత్త పట్టణాలను ఎఫ్‌ఎం ఛానల్స్ కలిగిన నగరాలుగా అభివృద్ధి పరచనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి పట్టణాల్లో మూడు ఛానళ్ల చొప్పున గుర్తింపు లభించింది. ప్రధానంగా కొప్పర్తి పారిశ్రామికవాడకు స్థానం లభించింది. కొప్పర్తి పారిశ్రామికీకరణకు అవసరమైన పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. స్థానిక ఉత్పత్తులకు గల అవకాశాల ఆధారంగా ఎటువంటి సెక్టార్లు అభివృద్ధి చెందడానికి గల అవకాశాలు ఉన్నాయనే కోణాలను స్పృశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొప్పర్తిలో వైఎస్ఆర్ పారిశ్రామికహబ్ పేరిట కార్యకలాపాలు సాగిస్తోంది. ఆల్ డిక్సన్ కంపెనీ మూడు షిఫ్టుల ప్రకారం రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తూ ఎలక్ట్రానిక్ గూడ్స్ ఉత్పత్తి కార్యకలాపాలను వేగవంతం చేసింది. పలు ఎంఎస్ఎంఇలు కార్యకలాపాలను సాగిస్తుండడం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.8,860 కోట్లతో పారి శ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడానికి ముందుకు రావడం నిరుద్యోగ లోకానికి ఉపశమనం కలిగిస్తోంది. 2,596 ఎకరాలను పారిశ్రామికాభివృద్ధికి కేటాయించనున్నారు. రూ.2,137 కోట్లతో కూడిన ప్రాజెక్టు వ్యయాన్ని కేటాయించనున్నట్లు ప్రకటించారు. 54,500 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రధానంగా రిన్యూవబుల్స్, ఆటో మొబైల్స్ విడిభాగాలు, నాన్ మెటాలిక్ మినరల్స్, టెక్స్‌టైల్స్, కెమి కల్స్, ఇంజినీరింగ్ విడిభాగాలు, మెటాలిక్ వస్తువులను ఉత్పత్తి చేయడానికి గల అవకాశాలను పరిశీలించారు. కొప్పర్తి పారిశ్రామి కాభివృద్ధి రాయలసీమ ఆర్థికాభివృద్ధికి చోదకశక్తిగా మారుతుందని భావించారు. కొప్పర్తి పారిశ్రామికవాడ అభివృద్ధి చెందడానికి అనువైన రీతిలో మౌలిక సదుపాయాలైన స్టేట్ హైవే, నేషనల్ హైవే, రైల్వే, ఎయిర్, పోర్టు కనెక్టివిటీ అంశాలను ప్రస్తావించారు. ఇందులో ప్రధానంగా 250 కిలోమీటర్ల పరిధిలో చెన్నయ్, బెంగళూరు నగరాలు ఉండడంతో కలిసి రానున్నట్లు గుర్తించారు. కొప్పర్తి పారిశ్రామికవాడకు ఎస్‌హెచ్-51 కడప-పులివెందుల రహదారి, ఐదు కిలోమీటర్ల సమీపంలో ఎన్‌హెచ్-40 కర్నూలు-రాణిపేట నేషనల్ హైవే, ఎనిమిది కిలోమీటర్ల సమీపంలో ఎన్‌హెచ్-716 నెంబరు గల కడప-చెన్నయ్ నేషనల్‌హైవే, ఎనిమిది కిలోమీటర్ల పరిధిలో ఎన్‌హెచ్ 544ఎఫ్ అనంతపురం-విజయవాడ నేషనల్ హైవేలు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. మరో తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో కృష్ణాపురం, 13 కిలోమీటర్ల పరిధిలో కడప రైల్వే జంక్షన్, 11 కిలోమీటర్ల పరిధిలో కడప ఎయిర్‌పోర్టు, 150 కిలోమీ టర్ల సమీపంలో తిరుపతి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, 200 కిలోమీటర్ల పరిధిలో కృష్ణపట్నం పోర్టు, 270 కిలోమీటర్ల సమీపంలో చెన్నయ్‌పోర్టు, 196 కిలోమీటర్ల పరిధిలో కొప్పర్తి రైల్‌కార్గో ఇంట ర్నేషనల్, 157 కిలోమీటర్ల పరిధిలో అనంతపురం ఎంఎంఎల్‌పి వంటి సదుపాయాలు అందుబాటులో ఉండడం కలిసి రానున్నట్లు ప్రకటించింది. కొప్పర్తికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించడంతో పారిశ్రామికవాడ పారిశ్రామిక హబ్‌గా మారడానికి వడివడిగా ముందుకు సాగడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు.

కొప్పర్తి పారిశ్రామిక వాడ

ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

సమాజ ఆర్థికాభివృద్ధితోపాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని విసి హాలులో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డిఎల్ఆర్‌సి) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు మొదటి త్రైమాసికం ముగిసేనాటికి నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.3,430 కోట్లకు గాను రూ.4520.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 131.79 శాతం ఆర్థిక ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. జిల్లా వ్యవ సాయ ఆధారిత జిల్లా ఈ రంగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమా సికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.2,425.50 కోట్ల లక్ష్యానికి గాను రూ.3,134 కోట్ల రుణాలను అందజేసి 124 శాతం ఆర్థిక ప్రగతిని సాధిం చడం జరిగిందన్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాలలో భాగంగా ఎంఎస్ఎంఈ సెక్టార్‌కు సంబంధించి రూ.478 కోట్లు మంజూరు చేసి 41శాతం ప్రగతి సాధిం చామన్నారు. రుణాలు అందించడంలో జూన్ మాసాంతానికి గాను జిల్లా పురోగ మనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థ వంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనేక రకాలయిన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. గ్రామాల పరిధిలో బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేసి గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. సురక్షితమైన డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలని సూచించారు. అర్హులైన యువ పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా రుణ సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రగతి సాధనలో తిరోగమనంలో ఉన్న ఆయా బ్యాంకు శాఖలు అందుకు కారణాలను తెలియజేయాలన్నారు. బడుగు బలహీన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టాండప్ ఇండియా, ముద్ర, గ్రామీణ ఖాదీబోర్డు వంటి ప్రభుత్వ పథకాలతో పాటు పంట రుణాలు, విద్యా రుణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అర్హులైన చేనేతలకు, మత్స్యకారులకు రుణాలు అందించి ఆర్థికంగా చేయుతనివ్వాలని సూచించారు. అంతేకాకుండా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహిం చాలన్నారు. పిఎం కిసాన్ లబ్ధిదారులకు కేసిసి మంజూరుకు సంబంధించి ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిం చాలన్నారు. కార్యక్రమంలో ముందుగా జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజ నేయులు డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశంకు సంబంధించిన అజెండా, వివరాలను కలెక్టర్ కి వివరించారు. చివరగా రిజర్వు బ్యాంకు స్థాపించి 90 సంవత్సరములు పూర్తి అయిన సందర్భంగా ఆర్బిఐ కోరిక మేరకు జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు క్విజ్ ప్రోగ్రాము నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎల్డీఎంకు సూచించారు. డిగ్రీ విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఇందుకు సంబంధించి ప్రచురించిన కరదీపికలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జి.ఆంజనేయులు, ఎస్‌బిఐ ఆర్ఎం పి.మురళి నాయక్, నాబార్డ్ ఏజీఎం విజయ్ విహారి, ఆర్బిఐ ఎల్డీఎం నవీన్ కుమార్, బ్యాంక్ ఆర్ఎం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'హ్యాకథాన్'తో మేధోమథనం

సమావేశంలో మాట్లాడుతున్న రామనాథన్

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం వారు ఇంటర్నల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-ఎఐ హ్యాకథాన్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులలో ఆవిష్కరణలు, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. పరిశ్రమ భాగస్వాములు, అధ్యాపకులు అందించిన వాస్తవ-ప్రపంచ సమస్యలపై పనిచేయడం ద్వారా విద్యార్థులు వారి సాంకేతిక సామర్థ్యాలను, సృజనాత్మకతను ప్రదర్శించడానికి హ్యాకథాన్ ఒక వేదికని వైస్ ప్రిన్సిపల్ అకాడెమిక్స్ రామనాథన్ అన్నారు. విద్యావిషయక జ్ఞానం, పరిశ్రమ అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఇటువంటి కార్యక్రమాల యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలతో పాటు నూతన ఆవిష్కర్తలు ప్రోత్సహించడంలో ఇలాంటి హ్యాకథాన్‌లు చాలా అవసరమన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో సహా పలు డొమైన్‌లలో హ్యాకథాన్ సవాళ్లను పరిష్కరించడానికి 25 బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయని విభాగాధిపతి డాక్టర్ చొక్కనాదన్ తెలిపారు. సంక్లిష్ట సమస్యలకు వినూత్న రీతిలో విద్యార్థులు పరిష్కారాలను అందించారని ఆయన అన్నారు. హ్యాకథాన్‌ను ఒక చిరస్మరణీయ అనుభవంగా మార్చిన భాగస్వాములు, మార్గదర్శకులు, నిర్వాహకులందరి ప్రయత్నాలను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం కో-ఆర్డినేటర్లు డాక్టర్ హేమలత, షాహీద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సిబ్బంది చొరవచూపాలి

- సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని సచివాలయ సిబ్బందికి మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశాలిచ్చారు. బుధవారం పోతబోలు, కొత్తవారిపల్లి గ్రామ సచివాలయాలను తహశీల్దార్ ఖాజాబీతో కలిసి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సుమోటో కింద రిజెక్ట్ చేసిన కుల ధృవీకరణ పత్రాల వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఆలస్యం చేయకుండా అందించాలని ఆదేశాలు జారీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగు తున్నాయి. బుధవారం చిత్తూరు, నెల్లూరు జట్ల మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.0 ఓవర్లలో 280 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 92 నాటౌట్, మాధవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రెడ్డిప్రకాష్ 3, అచ్యుతానంద 2, షేక్ జావీద్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. **182 పరుగులకే కుప్పకూలిన కర్నూలు జట్టు :** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 182 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 55.2 ఓవర్లలో 182 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహేంద్ర యాదవ్ 47, సాయి కృష్ణసింగ్ 42 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. దీపక్ 2, లోహిత్ సాయి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కుదిగిన అనంతపురం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 32.0 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ రోషన్ 74, యోగానంద 52 పరుగులు చేశారు.

తలపడుతున్న నెల్లూరు, చిత్తూరు జట్లు

తహశీల్దార్ పుల్లారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

రాయచోటి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన పుల్లారెడ్డిని బుధవారం జిల్లా ఎపిసిఆర్‌ఎఫ్ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు. తహశీల్దార్‌కు సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు గురుంచి వివరించారు. కార్యక్రమంలో ఎపిసిఆర్‌ఎఫ్ రాయలసీమ ప్రెసిడెంట్ మేకల దర్బార్ బాష, జిల్లా సభ్యులు రవి శంకర్, శంకర్ రెడ్డి, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేడు అవార్డు గ్రహీతలు హాజరవ్వాలి

ప్రజాశక్తి-రాయచోటి

అవార్డు గ్రహీతలు హాజరు కావాలి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఎవరైతే క్రీడా ప్రతిభా అవార్డుకు ఎన్నికయ్యారు గురువారం ఉదయం 10 గంటలకి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల వద్ద హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిటిఎం, రెండో బహుమతిగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాసాపేట రాయచోటి, మూడో బహుమతిగా కేజీబీవీ రామాపురం, నాలుగవ బహుమతిగా ఏపీ మోడల్ స్కూల్ సంబేపల్లి, ఐదవ బహుమతిగా జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ మదనపల్లి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు హాజరు కావాలని తెలియజేశారు. ఈ ప్రతిభ అవార్డు కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి

దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, తగు చర్యలు తీసుకోవాలని యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆరోగ్య సిబ్బంది శిబ్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని అనుంపల్లెలో లార్వా సర్వే నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలేరియా, డెంగీ, చికున్ గున్నియా జ్వరాలు దోమల ద్వారా వ్యాపిస్తాయని, దోమలు వృద్ధి నివారించడానికి ఫ్రైడేని డ్రై డేగా పాటించాలని, వర్షపు నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని, మంచి నీటి డ్రమ్ములు, పాత్రలపైన మూతలు పెట్టుకోవాలని తెలిపారు.అలాగే పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కుండలు వర్షపు నీరు నిలబడకుండా చేయడానికి తొలగించాలని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న రోళ్ళు మట్టితో నింపివేయాలని తెలిపారు. నిరుపయోగం తోట్లు, కాగులు, కుండలు బోర్లించాలని తెలిపారు.దోమలు నాశనం చేయడానికి సామూ హికంగా వేపాకు పొగ పెట్టటం చేయాలని తెలిపారు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఇంటి చుట్టూ మురుగు నీరు నిలబడకుండా చేయడానికి ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. **రాజంపేట అర్బన్ :** వాహకాలుగా పనిచేసి అనేక ప్రాణాంతక వ్యాధులకు కారకాలైన దోమల వృద్ధిని ఆరోగ్యాన్ని సంరక్షించుకుందామని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత పిలుపునిచ్చారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వై.ప్రదీప్ కుమార్, డాక్టర్ గిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులతో ఆర్టీసీ బస్టాండు నుంచి పాత బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి దోమల నుంచి వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనాఫిలిస్, ఎడిస్, క్యూలెక్స్ వంటి పరాన్న జీవులకు దోమలు వాహకాలుగా ఉంటూ మానవులను అనేక రోగాల పాలు చేస్తాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఒడి పి.ద్వారకనాథరెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ పి.పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని నిజం స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృక్షాల వలన వాతావరణం సమతుల్యంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచీకరణలో భాగంగా వృక్షాలను నరికి వేయడంతో అధిక ఉష్ణోగ్రతలు, అతివృష్టి, అనావృష్టి సంభవించి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు ఒక మొక్కను నాటాలని, వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్స హించి స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసుకుని విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరే వెంకటసుబ్బయ్య నాయుడు, ఉపాధ్యాయులు రమణ, వీరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బిటి కళాశాలకు శానిటరీ న్యాప్‌కిన్స్ బ్యాంక్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం స్థానిక బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సామాజిక సేవా సంస్థ హెల్పింగ్ మైండ్స్ సభ్యులు, అధ్యక్షుడు అబూబకర్ నేతృత్వంలో శానిటరీ న్యాప్‌కిన్స్ బ్యాంక్ వితరణ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఆర్‌జెడి డాక్టర్ పి.బాబు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ ప్రధానం చేసిన హెల్పింగ్ మైండ్స్ అధ్యక్షుడు అబూబకర్ వితరణ శీలతను కొనియాడారు. విద్యార్థులను ఉద్దేశించి అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ విద్యార్థినులు నెలసరి రోజుల్లో పాటించవలసిన శుభ్రతపైన, ఆ రోజుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపైన సలహాలు ఇచ్చారు. హెల్పింగ్ మైండ్స్ సంస్థ కళాశాల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ బ్యాంకును ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి, అధ్యాపక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, హెచ్.సి.రామ్మూర్తి, కళాశాల అధ్యాపకులు డాక్టర్ శైలజ, డాక్టర్ దేరంగుల శ్రీనివాసులు, డాక్టర్ జి.చిన్నారెడ్డి అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అబూబకర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, ఆర్‌జెడి

శాంతిసదన్‌లో కేక్ కట్ చేస్తున్న విభిన్నప్రతిభావంతులు

విభిన్నప్రతిభావంతుల హక్కుల సాధనకు కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విభిన్నప్రతిభావంతుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిరావే దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విభిన్నప్రతిభావంతుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మదనపల్లి పట్టణం స్థానిక మిషన్ కాంపౌండులోని శాంతి సదన్‌లో కేక్ కట్ చేసి విభిన్నప్రతిభావంతులకు, వృద్ధులకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు యస్. మౌలాలి మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలో ఘనంగా పండగ వాతావరణంలో వేడుకలు జరిగాయన్నారు. మందకృష్ణ మాదిగ చేసిన అనేక ఉద్యమాలు ఫలితంగానే విభిన్నప్రతిభావంతులకు రూ.200 పింఛన్ నుంచి రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల పింఛను నేడు సాధ్యమైందన్నారు. ఆరోగ్యశ్రీ, వికలాంగుల స్కూటర్లు, వివాహ ప్రోత్సాహక బహుమతి, బ్యాటరీ సైకిల్స్, వికలాంగులకు బ్యాంకు రుణాలు వంటి అనేక పథకాలు వికలాంగులకు అందుతున్నాయింటే కేవలం వికలాంగుల హక్కుల పోరాట సమితి వల్లనే సాధించడం జరిగిందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వికలాంగుల హక్కుల సాధనకై అలుపెరగని కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వరి, నరసింహులు, ఎ.నాగరాజ, మునిరాజ, భీమయ్య, థామస్, రెడ్డప్ప పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే గోశాలకు తరలిస్తాం

ప్రజాశక్తి-మదనపల్లి : సెప్టెంబర్ 10వ తేదీలోగా గోవులను పట్టణంలోని నివాస ప్రాంతాల ప్రధాన రోడ్లు, ప్రధాన కూడళ్ళలో సంచరించకుండా మీ ఇంటి ఆవరణంలోనే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశాల మేరకే సెప్టెంబర్ 10వ తారీకు పైన నివాస ప్రాంతాలు, రోడ్లు మరియు ప్రధాన కూడళ్లలో గోవులు సంచరిస్తే పురపాలక సిబ్బంది ద్వారా గోశాలలకు తరలించబడునని తెలిపారు. సెప్టెంబర్ 20వ తారీకు లోపల పందులను మేపు వారు వాటిని పురపాలక సంఘం నివాస ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లో సంచరించకూడదని తెలిపారు. మదనపల్లె పురపాలక సంఘంనకు ఐదు కిలోమీటర్ల దూరంలో పందులను పెంచుకోవాల్సిందిగా సూచించారు. నిబంధనలు పాటించనిచో పందులను పట్టించి దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు.

సెప్టెంబర్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి-రాయచోటి : కలెక్టర్ శ్రీధర్ చామకూరి వారి అనుమతితో సెప్టెంబర్ నెలలో జిల్లాలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు స్టెప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయిగ్రేస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా పలు అంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. 15-29 ఏళ్ల వయస్సు గల ఆసక్తి కలిగిన యువతీ యువకులు సంబంధిత పోటీలలో పాల్గొనేందుకు సన్నద్ధం కావాలని కోరారు.థీమాటిక్ పోటీలు, సైన్స్ ప్రాజెక్ట్స్ థీం ఇన్నోవేషన్ ఇన్ సైన్స్, టెక్నాలజీ), సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం (గ్రూప్ సోలో), జానపద గేయం (గ్రూప్ సోలో) ప్రత్యక్ష కార్యక్రమం,జీవిత నైపుణ్య విభాగంలో కవిత్వం, కథా రచన, పెయింటింగ్, డిక్లమేషన్ (ప్రకటన), యువకృతి విభాగంలో హస్త కళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఆర్ఓ ప్లాంట్ ప్రారంభోత్సవంలో ముక్కా వరలక్ష్మి

నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పివిజి.పల్లి గ్రామపంచాయతీ కొండంపల్లి దళితవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బుధవారం రైల్వేకోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి ప్రారంభించారు. పుల్లంపేట మాజీ ఎంపిపి పోలూరు కృష్ణమ్మనాయుడు తండ్రి వర్ధంతి సందర్భంగా ఆర్ఓ ప్లాంట్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి తాగునీరు, ప్రతి ఇంటికి శుద్దినీటిని అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఏ గ్రామంలో అయినా తాగు నీటి సమస్య రాకూడదని అన్నారు. తాగునీరు, విద్యుత్ ప్రతి గ్రామానికి ప్రధాన మైనవని వాటిలో ఎలాంటి సమస్య ఎత్తిన తక్షణమే పరిష్కరించేందుకు ముందుం టామని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జివి రవాణా కార్యాలయం..

మండల పరిధిలోని మంగంపేట గ్రామానికి చెందిన గునిపాటి వేణుగోపాల్‌కు చెందిన జివి లాజిస్టిక్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాన్ని ముక్కా వరలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో లావులూరి చరణ్, రాజేష్, వెంకటరమణ, శివకుమార్, అను ములగుండం చంద్రమోహన్, గుండుపాటి రాయుడు, కల్ల చలపతి పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డిపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డిపై దుష్ప్రచారం చేస్తే తగిన బుద్ధి చెబుతామని టిడిపి సీనియర్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పిటియం రోడ్డులోని గ్రానైట్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయచంద్రారెడ్డిపై కొందరు అనవసరంగా అవాకులు, చవాకులు పేలుతున్నారని వారి వల్లే ఇటీవల జరిగిన ఎన్నికలలో టిడిపి ఓటమి పాలైందని అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వారు కచ్చితంగా మద్దతు ఇచ్చివుంటే టిడిపి అభ్యర్థి గెలిచేవారని అన్నారు.నియోజకవర్గంలో కుయుక్తులతో తమ స్వలాభం కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇలాంటి విధానాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపిటిసి గంజి మోహన్, ఆనంద్‌రెడ్డి, బడికాయలపల్లి మారెప్ప, బడికా యలపల్లి కృష్ణారెడ్డి, గట్టు కుమార్, తాకాటంవారిపల్లి ఓబులేష్, బాలసానిపల్లి ముమ్మిడి జయచంద్ర, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రులను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

ఆలయ గోపురం ప్రారంభానికి మంత్రులకు ఆహ్వానం

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడులో సెప్టెంబర్ నెల 4, 5, 6వ తేదీలలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీ రామాలయం మహారాజా గోపుర ప్రారంభోత్సవ వేడుకకు శ్రీ రామా లయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంత్రులు ఆనం రామనారాయరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు తప్పనిసరిగా రావాలని మంత్రులను కోరారు. ప్రారంభోత్సవానికి విచ్చేసే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ వారికి మంత్రి సూచన చేశారు. మంత్రిని కలిసినవారిలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చెర్మన్ కెడం లక్షుమయ్య, టిడిపి మండల నాయకుడు కొండ్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సిద్ధారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తొగట వీర సంఘ అధ్యక్షుడు మోడెం చెన్నయ్య, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

3 నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని 16 రెవెన్యూ గ్రామాలలో సెప్టెంబర్ 3నుంచి అక్టోబర్ 15వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహి స్తున్న ట్లు తహశీల్దార్ జె.భాగ్యలత పేర్కొ న్నారు. గ్రామాల వారిగా రైతులు ఆయా గ్రామ పరిధిలో సచివాల యాలలో వద్ద జరిగే రైతు సదస్సు కు హాజరై తమ సమస్యను విన్నవిం చుకుంటే అక్కడే పరి ష్కారం అవుతుందని తెలిపారు. సెప్టెంబర్ 3న వెలిగల్లు, 6న గాలివీడు, 10న గాలివీడు-3 సచివాలయం, 13న గోరన్ చెరువు, 17న ప్యారంపల్లి, 19న గోపనపల్లి, 21న గరుగుపల్లి, 24న గుండ్లచెరువు, 26 న పందికుంట, 28న తలముడిపి, అక్టోబర్ 1న కొర్లకుంట,3న నూలివీడు, చీమలచెరువుపల్లి, 5న ఎగువగొట్టివీడు, 8న అరవీడు,10న పులికుంట, 15న తూముకుంట జరుగుతుందని తెలిపారు. భూ సమస్యలున్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సులకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ భాగ్యలత

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కృషి సంస్థ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ షబానా, ఐసిటిసి కౌన్సెలర్ చంద్రమోహన్, ఎల్‌టి.బాలాజిలు గిరిజన పాఠశాల విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించారు. హెచ్ఐవి వ్యాధి ఎలా వస్తుం ది, ఎలా వ్యాపించదు, ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూప కుండా ఎలాగా సమాజంలో కలసి జీవించేలా ధైర్యాన్ని నింపాలని చెప్పారు. ఎయిడ్స్‌పై విద్యార్థులు కూడా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. తమ చుట్టూ ఉన్న వారికి కూడా ఎయిడ్స్ గురించి చెప్పి వారిని చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంతో మంది ఎయిడ్స్ మహమ్మారి బారిన పడి కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్, క్షయవ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు, చికిత్స గూర్చి, హెచ్ఐవి ఎయిడ్స్ ఆక్ట్ 2017, ఎఆర్‌టి మందులు, ఎపిఎస్ ఎసిఎస్ యాప్, టోల్‌ఫ్రీ నెంబర్ 1097 గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కృషి సంస్థ సిబ్బంది, రేఖ, సావిత్రి, సౌజన్య, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసిటిసి కౌన్సెలర్ చంద్రమోహన్

మెరుగైన వైద్య సేవలు అందించండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-సుండుపల్లి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్ఒ కొండయ్య పేర్కొన్నారు. బుధవారం సుండుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు విజృం భిస్తున్నాయని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులు వచ్చిన వెంటనే నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో జ్వరపీడితులపై సర్వే చేయించి, ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో జ్వరంతో బాధపడుతున్న వారి రక్త పూతలను సేకరిం చి వ్యాధి నిర్ధారణ చేసుకొని మందులను అందివ్వాలని చెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరీక్షించి వైద్యం సరిగ్గా అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు.అనంతరం రాయవరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలపై వైద్య సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫారన్‌ఖాన్, సూపర్వైజర్ వెంకటరమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రోగిని పరీక్షిస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- సప్తగిరి గ్రామీణ బ్యాంకు జిఎం డి.ప్రభాకరన్

బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జిఎం ప్రభాకరన్

ప్రజాశక్తి-కలికిరి

గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలు అందిస్తున్నట్లు జిఎం .డి ప్రభాహరన్ తెలిపారు. మడలంలోని మహాల్ గ్రామంలో బుధవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభించారు. భవన యజమాని బ్యాంకు డిపాజిటర్లను శాలువ, పూలమాలతో సన్మానించారు. బ్యాంకు సేవల గురించి ప్రజల అభిప్రాయాలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, మొదలగు బీమా పథకాల గురించి రీజనల్ మేనేజర్ పి. ప్రకాష్‌రత్నబాబు క్లుప్తంగా ఖాతాదారులకు వివరించారు. మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యుపిఐ, ఐఎంపిఎస్ తదితరసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరూ వీటిని వినియోగించుకోవాలని మహల్ బ్రాంచ్ మేనేజర్ మస్తానమ్మ తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ సిబ్బంది, కలికిరి, కలకడ సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్లు, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యాన సాగు : ఎడి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఉద్యాన పంటలను సాగు చేయాలని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో మిశ్రమ అభ్యసన ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండో రోజుకు చేరాయి. బుధవారం వివిధ అంశాలపై అధ్యా పకులు, శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు ఇచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉద్యానసాగు సుస్థిరత అనే అంశంపై శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ బోధన విధానంలో తరగతి గదిలో నేర్చుకునే విద్యాంశాలతో పాటు ఆన్‌లైన్‌లో పొందుపరచిన బోధన వీడియోల ద్వారా మరింత పరిజ్ఞానం పొందవచ్చని అన్నారు. సేంద్రి య వ్యవసాయం, కాకరలో జీన్ మ్యాపింగ్, ధృవీకరించిన విత్తనాల ఉత్పత్తి, భవిష్యత్తులో పూల పెంపకం, కంప్యూటర్ ఆధారిత ల్యాండ్‌స్కేప్ డిజైనింగ్ అంశాలపై అధ్యాపకలు డాక్టర్ గంగాధరరావు, డాక్టర్ లలిత, డాక్టర్ ఉషా కుమారి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దొరార్జీరావు, సాయిరత్న శర్వాణీ శిక్షణ ఇచ్చా రు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సీహెచ్ రూత్,డాక్టర్ స్వరాజ్య లక్ష్మి, డాక్టర్ యువరాజ్, డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, డాక్టర్ జయప్రద పాల్గొన్నారు.

శిక్షణా కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్, అధ్యాపకులు

ఇ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనం

ఇ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సహాయకురాలు గాయత్రి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట, పేరియవరం తదితర గ్రామ రెవెన్యూ పరిధిలో వ్యవసాయశాఖ సహాయకులు గాయత్రి ఆధ్వర్యంలో పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం అప్పయ్య రాజుపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని గారాల మడుగు పంట పొలాల వద్ద ఇ-క్రాప్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రయోజనాలు ఉన్నాయని అప్పయ్యరాజుపేట వ్యవ సాయ శాఖ సహాయకురాలు గాయత్రి తెలిపారు. రైతులు సాగు చేసు కునేటప్పుడు ఈ-క్రాప్ నమోదు చేసుకోవడం వలన ప్రభుత్వం వారికి అనేక రాయితీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. రైతులు అవసరమైన ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ధరకు లభిస్తాయని చెప్పారు. పంట నష్టం వచ్చినప్పుడు బీమా కూడా ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకే వర్తిస్తుందని అన్నారు. అప్పయ్యరాజుపేట రెవెన్యూ పరిధిలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నామని ప్రతి రైతు నమోదు చేయించుకోవాలని ఆమె తెలిపారు. రైతులు పొలాల వద్ద ఉండాలని ప్రతి రైతు పొలంలోకి వచ్చి ఈ-క్రాప్ నమోదు చేస్తారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన ప్రతి ఒక్కరూ కూడా నమోదు చేయించుకోవాలని ఆమె రైతులను కోరారు.

ఫ్రీహోల్డ్ భూములను గుర్తించాలి : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-నందలూరు

ఫ్రీహోల్డ్ భూముల వివరాలను వీలైనంత త్వరగా గుర్తించి త్వరగా పూర్తి చెయ్యాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ కార్యాల యానికి వచ్చే ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. విధుల పట్ల అలసత్వం వహించకుండా సమయపాలన పాటిం చాలని సూచించారు.ఫ్రీ హోల్డ్ భూముల పున:పరిశీలనను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ అమర్నాథ్, ఆర్ఐ సుశీల్, మండల సర్వేయ ఓబయ్య, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్

ఫారం పాండ్ మంజూరుకు దరఖాస్తులు : ఎపిఒ

ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న ఎపిఒ చెన్నకేశవులు

ప్రజాశక్తి-కలకడ

ఫారంపాండ్ మంజూరు కోసం దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ఎపిఒ చెన్నకేశవులు పేర్కొన్నారు. బుధవారం మండలంలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను పరిశీలించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలకడ పంచాయ తీలోని కె.కొత్తపల్లి సమీపంలో ఉన్న చెరువులో జరుగు తున్న ఫారంపాండ్ పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. రైతులకు ఫారంపాండ్ ఉపయోగం, నీటి నిల్వ, నీటి సంరక్షణ పనులలో భాగంగా తవ్వేటటువంటి సేద్యపు నీటికుంట వలన భూగర్భ జలా లు అడుగంటి పోకుండా పెంచుటకు ఉపయోగంగా ఉంటాయని, రైతులకు సూచించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులలో వీటి జలాలతో చిన్న చిన్న పంటలకు నీరు అందించుటకు ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. పశు వులకు తాగునీరు అందించుటకు ఉపయోగ పడతాయని, ప్రస్తుతం ఫారం పాండ్ తవ్వుటకు సిద్ధంగా ఉన్న సన్న చిన్నకారు రైతులకు మంజూరుకు దరఖాస్తులు తీసుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. ఆసక్తిగల రైతులు ఎవరైనా వారి పంచాయతీలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

తూతూ మంత్రంగా చౌకదుకాణ డీలర్ల సమావేశం

-సిఎస్ డిటి తీరుపై తహశీల్దార్ అసహనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల చౌక దుకాణ డీలర్ల సమావేశం తూతూ మంత్రంగా సాగింది. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండ లంలోని చౌకదుకాణ డీలర్లు, ఎండియు వాహన నిర్వాహకుల సమా వేశం జరి గింది. ఈ సందర్భంగా తహశీల్దార్ చౌకదుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యవసరసలకులపై సమీక్ష చేశారు. సరకులు, విక్రయాలు, నిల్వల లెక్కలు అడిగిన తహశీల్దార్ భీమేశ్వర రావుకు సిఎస్.డిటి నారాయణరెడ్డి సమాధానం చెప్పలేక దాటవేసే ధోరణిని అనుసరించారు. గతంలోనూ ఈయన ఇదే విధంగా పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకున్న దాఖలాలున్నాయి. అందులోనూ ఈ సమావేశానికి హాజరు కావలసిన పీలేరు మండల పరిధిలోని 12 మంది ఎండియు ఆపరేటర్లకు గాను వారిలో నలు గురు మాత్రమే సమావేశానికి రావడంతో తహశీల్దార్ మండిపడ్డారు. మండల పరిధిలోని మహిళా చౌక దుకాణ డీలర్లకు బదులు వారి స్థానంలో వారి భర్తలు హాజరు అవడం ఏంటని ప్రశ్నించారు. ఇకపై జరిగే సమావేశాలకు మహిళా డీలర్ల స్థానంలో వారే హాజరుకావాలని సూచిం చారు. గోదాము డిటి కూడా ఈ సమావేశానికి గైర్హాజరయ్యారు కావడం కొస మెరుపు.

మాట్లాడుతున్న తహశీల్దార్ భీమేశ్వరరావు

బురదమయంగా ఉన్న పెద్ద బలిజపల్లె రోడ్డు

బలిజపల్లె రోడ్డుకు మోక్షమెన్నడో?

-ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

-పట్టని అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లి నుంచి బలిజపల్లికు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని గ్రామ ప్రజలు, వాహనదారులు తెలిపారు. వర్షం వచ్చిదంటే మరింత అధ్వానంగా మారుతోందని రోడ్డంతా బురదమయంగా మారడంతో వాహనాలు కిందపడి గాయాలపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు నామమాత్రంగా తాత్కలికంగా మరమ్మతులు చేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గత వైసిపి పాలనలో కూడా ఎవ్వరూ పట్టించుకోలేదని, ఎన్నికల ముందు హామీలు ఇచ్చారు తప్ప రోడ్డు మరమ్మతు చేపట్టలేదని అన్నారు. టిడిపి ప్రభుత్వంలోనైనా ఈ రోడ్డు కు శాశ్వత పరిష్కారం ఉంటుందని ఆశగా ఎదురుచూస్తున్నాని అన్నారు. కానీ ఇంతవరకు ఏ రాజకీయ నాయకుడు వచ్చి రోడ్డును పరిశీలించలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సిసి రోడ్డు నిర్మించి వాహనదారుల కష్టాలను తీర్చాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-పీలేరు

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.పి.అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురష్కరించుకుని పీలేరు ఏరియా ఆస్పత్రి, చిత్తూరు బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, ల్యాబ్ టెక్నీషియన్ మునాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని దానంరెడ్డిగారిపల్లి వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. ఎగువ పల్లి ప్రాంతం నుంచి గాలివీడు పట్టణానికి రవాణా చేస్తూ ఉండడం తమ దృష్టికి రావడంతో తనిఖీలు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ద్వారా ఇసుక పొందాలని చెప్పారు. అధికారుల అనుమతి లేకుండా చెరువులు, కుంటలు కాలువలు, నదులలో ఉండే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జింకల గుంపు అడ్డొచ్చి రైతుకు గాయాలు

ప్రజాశకి-మదనపల్లె అర్బన్

జింకల గుంపు అడ్డు రావడంతో ఓ రైతు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. బి.కొత్తకోట మండలం, కాండ్లమడుగు గ్రామం, కోటా ఊరుకు చెందిన రైతు ఈశ్వరయ్య ములకలచెరువు మండలం, పెద్దపాలెం వద్ద భూమి లీజుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. బుధవారం పొలం వద్దకు బైకులో వెళుతుండగా, మార్గ మధ్యంలోని పెద్దపాలెం గేటు వద్ద జింకల గుంపు బైక్‌కు అడ్డురావ డంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108లో మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి..

మదనపల్లె అర్బన్ : వాల్మీకిపురం మండలం, బూడిద వేడుకు చెందిన దేవేంద్ర(30) పలమనేరు సమీపంలోని బైరెడ్డిపల్లిలో జరుగుతున్న బంధువుల పెళ్లికి మంగళవారం రాత్రి వెళ్ళాడు. పెళ్లి చూసుకొని బుధవారం తిరిగి బైకులో తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గ మధ్యం లోని నిమ్మనపల్లి మండలం, మర్రిబండ మలుపువద్ద బైకు అదుపు తప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

23 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని పెద్దినేని కాలవ గ్రామపంచాయతీ బుడిచేటపల్లి క్రాస్ వద్ద నాటుసారా తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు అరెస్ట్ చేశారు. కెవిపల్లి మండలం జిల్లేడు మంద గ్రామం పెద్ద తాండకు చెందిన బుక్కే నాగార్జున నాయక్, బుక్కే ఉదయ్ కుమార్ నాయక్‌లు స్వయంగా నాటుసారా తయారు చేసి మండలంలో పలు ప్రాంతాల్లో ఉన్నవారికి విక్రయిస్తున్నారని సమాచారం అందిస్తుందని అన్నారు. తమ సిబ్బందితో కలిసి బూడిదపల్లి క్రాస్ వద్ద ఇరువురిని అదుపులో తీసుకుని అరెస్టు చేసి 23 లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా , విక్రయించినా చట్టరీత్యా నేరమని అన్నారు. మండలంలోని ఎవరైనా సాటుసారా తయారు చేస్తే తమ దృష్టికి తీసుకరావాలని ప్రజలకు సూచించారు. కార్యక్ర మంలో ఎఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ బిడి నాయక్, కానిస్టేబుల్ మోహన్, ప్రవీణ్, రాజు, హోంగార్డు శివయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సెబ్ ఎస్ఐ రాముడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టుపల్లె సమీపంలోని గంగోత్రి ఫంక్షన్ హాల్ వద్ద మహేంద్ర అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి నిందితుని ఇంట్లో సోదాలు చేయగా 18 టెట్రా ప్యాకెట్ల కర్నాటక మద్యం పట్టుబడడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిపై మద్యం అక్రమ విక్రయాల కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

సుండుపల్లి : పట్టుబడ్డ నాటుసారా నిందితులతో పోలీసులు